మకాం మార్చాడు. కొన్నినెలల తర్వాత తిరిగి ఆసిఫాబాదు వెళ్ళేసరికి కొన్ని సంగతులు తెలిశాయి – వెలగటూరు నుంచి జానికమ్మ అనేవ్యక్తి పోయిందని తనకోసం కబురు వచ్చినట్లు. తాను లక్సెట్టిపేటలో వుంటున్నట్లు ఊళ్లో ఎవరికీ తెలియకపోవడంవల్ల సరైన అడ్రసు ఇవ్వనట్లు తెలిసింది. వెలగటూరు వెళ్లామా వద్దా అని ఆలోచించాడు లక్ష్మన్న. వెళ్లిమాత్రం తానిప్పుడు సాధించేదేముంది ?? అని మళ్లా పునరాలోచించి ధర్మన్న తండ్రి యాదగిరికి ఓ ఉత్తరం వ్రాశాడు – దానికి వెంటనే సమాధానం వచ్చింది. జానకమ్మ చివరి దశలో కాంతమ్మగారి కుటుంబంతో సంబంధం పెట్టుకున్నదనీ, జానకమ్మ ఇవ్వవలసిన బాకీకిగాను కాంతమ్మగారు ఆమె అనంతరం ఇంటిని స్వాధీనపరచుకున్నారనీ, ప్రస్తుతం కాంతమ్మగారు ఆ యింటిని బాగుచేసుకుంటున్నారనీ, వ్రాశాడు. జానకమ్మ ఆఖరిదశలో కూడా జామిచెట్టుపై వ్యామోహం వదలలేక పోయిందనీ, మాట పడిపోయేదశలో నీకు బంధువులెవరైనా వున్నారా ? ఏమైనా చెప్పాలా ? అని ప్రశ్నిస్తే తమ మతగురువైన రామానుజులవలె రెండు వేళ్లతో నేలనూ నింగినీ చూపించి మరీ పడిపోయిందనీ, ఇందలి వేదాంతార్థం గూర్చి ధర్మపురిలో విద్వాంసులను నిర్ణయించవలసిందిగా వెలగటూరు వాసులు కోరారని, ధర్మయ్య తండ్రి యాదగిరి ఆ వుత్తరంలో పేర్కొన్నాడు.

లక్ష్మన్న చాలా సేపు విచారించాడు. అయితే ఆస్తి దత్తస్వీకారమూ రెండూ లేకుండా తానామెకు కర్మచేసి ప్రయోజనమేమిటని లక్ష్మన్న ఇక వెలగటూరు గూర్చి ఆలోచించడం ఆ తర్వాత మానివేశాడు. కాని అతనికి జానకమ్మ చూపించిన చిన్ముద్రమాత్రం మనస్సులో అప్పుడప్పుడూ మెదులుతూనేవుంది.

ఇలా వుండగా కొంతకాలం తర్వాత ఒకరోజొక విచిత్రం జరిగింది. లచ్చన్న పనిచేస్తున్నచోట ఒకాయన పత్రిక చదువుతూ 'విన్నావా ఈ విడ్డూరం లచ్చన్నా' అన్నాడు. 'యేమేమిటని' లచ్చన్న ప్రశ్నించగా ఆ ఆసామీ ఇలా చెప్పాడు "వెలగటూరులో కరంటువేస్తూ స్తంభాలకడ్డం వస్తున్నదని కాంతమ్మగారనే వాళ్లయింటి జామకొమ్మలను కొట్టివేశారట. వట్టిమోడుండి ఏం ప్రయోజనమని కట్టెలకోసం వ్రేళ్లనుండీ త్రవ్వించగా, భూమిలో కుండనిండా ధగధగ మెరిసే బంగారునాణాలు దొరికాయట. నలుగురూ చూచారుకాబట్టి దాచే వీలు లేకపోయింది. భూగర్భంలోని ధనం కాబట్టి ప్రభుత్వం స్వాధీనం చేసుకొని దాని కాల నిర్ణయానికై పరిశోధనాశాఖవారికి హైదరాబాదు పంపారట" అని చెప్పగా కళకత్తా జామపండులా తెల్లబోయిన ముఖంతో నోట మాటరాక, శూన్యంలోకి చూస్తూ వుండిపోయాడు లచ్చన్న!

---

# ఎక్స్‌పర్ట్

కొడవటిగంటి కుటుంబరావు

దిగో-ఎహెడ్ పిక్చర్ కార్పొరేషను ప్రొప్రయిటరు ముప్పైఏళ్ళవాడు. అదృష్టాని కతన్ని ఆదర్శంగా చెప్పుకుంటారు. అతను పదిహేను రూపాయల నౌకరీ చేసిన ఊళ్లో ఇప్పుడు నెలకు షుమారు 15 వేలు సంపాదిస్తున్నాడు. దాదాపు పది పన్నెండు లక్షల రూపాయలు అతనిపేర పెట్టుబడి అయివుంది.

అతనికి తెలివితేటలేవీ లేవని కొందరన్నారు. తనకు ఏవిధమైన ప్రజ్ఞా లేదని అతనే చెప్పుకునేవాడు. అతనికి ఆత్మే లేదని మరికొందరు అన్నారు అదృష్టం తప్ప అతని కున్నదంటూ చెప్పుకోబడ్డదేమీలేదు.

అదృష్టం అనేదికూడా కొంద రనుకునేటంత అర్థహీనమైనది కాదు. అతని ప్రతి నిర్ణయమూ ఆలోచించిచూస్తే తెలివిగా కనిపించేది ఆ నిర్ణయానికి రావటానికి అతనా తెలివితేటలు బుద్ధిపూర్వకంగా ఉపయోగించేవాడా అనేది వేరే విషయం. అతను ముట్టుకున్నదల్లా బంగారమయేది. కాని అతను అన్నీ ముట్టుకునేవాడుకాడు. అతను ముట్టుకోనిది బంగారమల్లే కనిపించినా మట్టి అయేది. అతనికి తెలివితేటలు లేవనేది జగద్విఖ్యాతమైనప్పటికీ, తెలివిగలవాళ్ళనిపించుకున్నవారు అతని కన్న ఎక్కువ తెలివితేటలు కనబరిచిందెన్నడూలేదు. వాళ్ళుచేసే పొరపాట్లు అసలతను చేసేవాడేకాదు ఎంతో ప్రజ్ఞావంతు లనిపించుకునే వ్యాపారస్తులు అతన్ని గుడ్డిగా అనుకరించి ఒక్కొక్కప్పుడు దెబ్బతినేవాళ్ళు.

అతను సినిమా లైనులోకి ఎందుకు వచ్చాడో ఎవరూ ఊహించలేకపోయినారు ఈ నాటికీ అతనికి సినిమా తాలూకు తలాతోకా తెలియదు అతనికి సంగీతం వినటంలోగాని, అభినయం గ్రహించటంలోగాని ఏమీ అభిరుచిలేదు.

ఈ నాటి కింకా అతను మంచి పిచ్చరేమిటో చెడ్డ పిక్చరేమిటో ఎరగడు. తన చిత్రనిర్మాణానికిగాను అతను అనేక మందిని పట్టి వారందరికీ తలా ఒక డిపార్టుమెంటూ వప్పజెప్పి తను స్టుడియోకైనా రాకుండా సగటున తను తీసే ప్రతి పిక్చరుమీదా పాతిక ముప్ఫయి వేలు నికర లాభం గుంజుకుంటున్నాడు. అతనిమీద మరొక ప్రొడ్యూసరు ఒక విసురు విసిరినట్టు ప్రతీతి: "___నికి వ్యాపార జ్ఞానం లేకపోవటంవల్ల, తను దివాలాతీస్తున్న సంగతికూడా తెలుసుకోలేదు. ఈ లోపుగా చెడుమార్గాన పోతూవుండిన వ్యాపారం దానంతట అదే మళ్ళీ లాభాన పడుతుంది. అదే మరొకడైతే సంవత్సరానికోసారి దివాలా తీసి ఉండును___కేవలమూ భయం కొద్దీ!"

అతను జీవితంలో స్వేచ్ఛాజీవి తాగుతాడు. స్త్రీ వ్యసనంకూడా బాగా ఉంది. గుర్రప్పందాల్లో బాగా డబ్బు పెడతాడు... గెలుస్తాడు. కాని వ్యాపారంలో ఎంతో నియమం పాటిస్తాడు వేరే దృష్టాంతం దేనికి? అతను తన సినిమాల్లో నటించే ఆడవాళ్ళతో ఎన్నడూ మాట్లాడిఅయినా ఎరగడు. అతని పిక్చరులో బుక్కయేవాళ్ళు, ఆడవాళ్ళయేది, మగవాళ్ళయేది, మేనేజరును చూడవలసిందే.

ఆ కారణంచేత మాలతి మొదట్లో మేనేజరు దగ్గిరికే వెళ్ళింది. కాని అతని ప్రవర్తన ఆమెకు నచ్చలేదు. అతను అనవసర ప్రసంగం ప్రారంభించాడు. అతన్ని చూడవచ్చే ఆడవాళ్ళు అతన్ని సామాన్యంగా ప్రోత్సహించేవాళ్ళు. మాలతి ఎదురుతిరగటం మేనేజరుగారికి కొత్త అనుభవమే. పైగా మాలతి అతనితో, "నాకు ఫిలిముల్లో వేషం వెయ్యటం తప్ప ఈ జన్మకి ఇంకో కోరిక లేదు." అన్నదికూడాను. సామాన్యంగా అతని దగ్గిరికి వ్యవహారరీత్యా వచ్చేవారందరికీ అదే కోరిక. దానికోసం కాస్తో కూస్తో త్యాగ చెయ్యటానికి వాళ్ళు సంసిద్ధులుగానే వుంటారు. కాని ఈ మాలతి–

మాలతి టాక్సీ ఎక్కి నేరుగా ప్రొప్రయిటరుగారింటికి పోయింది — పని కనుక్కోమన్నారని చెప్పిన నౌకరుకు, "రహస్య విషయాలు మాట్లాడాలట అని చెప్పు!" అని జవాబు చెప్పింది మళ్ళీవచ్చి నౌకరు మాలతిని లోపలికి తీసుకుపోయి కూర్చోబెట్టాడు.

ప్రొప్రయిటరు ఏదో కాగితాలు చూసుకుంటున్నట్టు నటిస్తూ మాలతికేసి చూడలేదు. నోట్లోవున్న చుట్టకూడా తియ్యకుండా "నేను మీకేంసహాయం చెయ్యగలను?" అన్నాడు

"నాకు మీరు తీసే పిక్చర్‌లో నటించాలని ఉంది!" అన్నది మాలతి.

"నాకు ఆ గొడవ ఏమీ తెలియదు. అదంతా మా మేనేజరే చూస్తాడు. నన్ను చూసి లాభం లేదు. దయచేసి వారినే





చూడండి!" అన్నాడు ప్రొప్రయిటరు.

"ఆయన్ను చూడటమయింది. తాతకు దగ్గులు నేర్పినట్టు మీ మేనేజరుగారు నాకు శరీరం లంచంపెట్టటం నేర్పుతున్నారు. శరీరం అమ్ముకోవటం నేనిదివరకే ఎరుగుదును. కాని శరీరం లంచం పెట్టటం నా కనుభవం లేదు, ఇష్టమూ లేదు. అట్లా ఒకరి అభిమానం సంపాదించి నా శక్తికి మించిన వేషంవేసి అపఖ్యాతి పాలుకావటం నాకసలిష్టంలేదు. పిక్చర్సులో పైకి రావాలని నేను తహతహ లాడిపోతున్నాను. నేను ఎక్‌స్ట్రాగా బయలుదేరడానికూడా సిద్ధంగా నే ఉన్నాను, నేను పనికొచ్చేది అందుకే ఐతే! మీరు కాస్త దయచేసి—"

ఈ ఉపన్యాసంతో డంగయి ప్రొప్రయిటరు మాలతికేసి చూడసాగాడు. అతని చెయ్యి అప్రయత్నంగా

నోటినుంచి చుట్ట తీసేసింది. కాని అతని రెండు దవడలకూ రెండు చుట్టల ఎడం ఏర్పడింది.

చెదిరిన మనస్సు మళ్ళీ కుదట పడగానే ప్రొప్రయిటరు తెలుసుకున్న విషయం ఏమంటే తనతో మాట్లాడు తున్న మనిషి పాతిక సంవత్సరాల ప్రాయంగల అపురూప సుందరి అని.

మంచి తెలివితేటలు లేనివాళ్ళు దేన్నీ గాఢంగా కాంక్షించలేరు. ప్రొప్రయిటరు ఇప్పుడు మాలతిని కాంక్షించినంత గాఢంగా అదివరకు ఏస్త్రీని కాంక్షించి ఉండలేదు. దాన్నిబట్టి, మాలతి తాత్కాలికంగా అతని తెలివితేటలను పెంపొందించిం దనుకోవాలి.

తను చాలా పటువుగా మాట్లాడా ననుకున్న మాలతి. ప్రొప్రయిటరు తనకేసి రెండు నిమిషాలు రెప్పవాల్చకుండా చూసికూడా ఏమీ సమాధానం చెప్పకపోవటమే కాక, తలవంచుకుని రాసుకోవటం మొదలుపెట్టేసరికి, నిరుత్సాహం పొందింది. కాని ప్రొప్రయిటరు తన రాత పూర్తిచేసి ఆ కాగితం మాలతికిచ్చి, 'మేనేజరును మళ్ళీ చూడు!' అన్నాడు. ఈ సారి ఆమెను కాస్త స్వతంత్రంగా ... ఐనా, చులకనచేసి కాకుండా సంబోధిస్తూ.

ప్రొప్రయిటరుగారి ఇంటిముందు మర్నాడు మళ్ళీ హాజరయింది మాలతి. ఆమెను చూడగానే ప్రొప్రయిటరు చివాలున లేచి నిలబడి, 'మళ్ళీ నాదగ్గర కెందుకొచ్చావు?' అన్నాడు.

మాలతి నిర్లక్ష్యంగా నవ్వి, "నన్ను మాటిమాటికి చూడటం దుర్భరంగాఉందా ఏమిటి?" అన్నది.

ప్రొప్రయిటరు నవ్వకుండానే, "లేదు, నిన్ను చూస్తున్నకొద్దీ అందంగా కనిపిస్తున్నావు. అదే చిక్కు. ఇంకా రెండు సార్లు నా దగ్గిరికిట్లా వచ్చావంటే నీకు పెద్దవేషం ఇమ్మని మేనేజరును ఆజ్ఞాపించి ఊరుకుంటాను, అది నా కిష్టంలేదు. దేవికారాణికైనా నే నదే చెప్తాను" అన్నాడు.

"అది నాకూ ఇష్టంలేదు. శాంతారాముకైనా నే నదే చెపుతాను" అన్నది మాలతి.


"మరయితే ఇప్పుడు నాతో పనేవిటి?"

"మీ ఉత్తరం చూడగానే నన్ను మీ మేనేజరుగారు మేకప్‌చేయించి కెమెరా ఎదట మైకులో మాటాడించారు. ఒక చిన్న టెస్టుకూడా తీసినట్టున్నారు. నేను మేకప్ తీసేసి వెళ్లిపోవటానికి సిద్ధపడుతూండగా మీ స్టూడియో ఊడ్చేవాడొకడు వచ్చి, 'నువ్వు సరిగా ఫొటోగ్రాఫు కావనీ, నీ గొంతు సరిగా రికార్డుకాదనీ మేనేజరుగారుచెప్పమన్నారు' అన్నాడు."

ప్రొప్రయిటరు అంతలో రుద్రుడల్లే అయిపోయి, "నా స్టూడియో మేనేజిమెంటుమీద అసత్యాలు కల్పించటానికి నీ కధికారం లేదు" అన్నాడు తీవ్రంగా.








"నా టెస్టువేసిఅయినా చూడకుండా నేను ఫొటోగ్రాఫు కాననీ, నా గొంతు రికార్డుకాదనీ అన్నవాళ్ళను ఎలా గౌరవించమన్నారు? ఒకవేళ నాతో ఆ విషయం చెప్పినవాడు మీ స్టూడియో ఊడ్చేవాడు కాడేమో, మీ డైరెక్టరేమో! అయితే నా పొరపాటు క్షమించండి!" అన్నది మాలతి.

ప్రొప్రయిటరు ఇక గంభీరంగా ఉండలేక పోయినాడు. అతను నవ్వుతూ, "ఇవాళ నేను స్టూడియోకు వెళ్లి, నీ టెస్టుచూసి, మా మేనేజరుతో మాట్లాడి వస్తాను. ఇది కేవలమూ నీ తృప్తికోసం సుమా! మా కామెరామాన్ నిన్నుచూసి ఫొటోగ్రాఫు కావంటే వేరే టెస్టు చూడక్కర్లేదు. నీ గొంతయినా అంతే! నాకింద పనిచేసేవారిలో నాకామాత్రం విశ్వాసం ఉంది. వాళ్లంత తెలివిగలవాళ్లు గాకపోతే ఏమీ తెలియకుండా నే నెట్లా స్టూడియో రన్‌చేస్తున్నాను? వెళ్లు రేపు కనిపించు, ఒక్క క్షణం ఉండు! బోయ్, దో కప్ చా!"

అన్నప్రకారం ప్రొప్రయిటరు స్టూడియోకువెళ్ళి మాలతిటెస్టు చూశాడు. టెస్టుచూసి ప్రొప్రయిటరు ఏమీ గ్రహించలేనిమాట నిజమే, కాని అతని చదువురాని కళ్ళకికూడా తనతో మాట్లాడే మాలతికీ ఈ టెస్టులోవున్న మాలతికీ చాలాతేడా కనిపించింది. ఆమీదట కామెరామాన్ ఫేస్‌మాడెలింగుమీదా సౌండు

రికార్డిస్టు హైఫ్రీక్వెన్సీస్‌మీదా చెరో పది నిమిషాలూ మాటాడి మాలతి దండగని తేల్చారు. ఆటు తర్వాత మాలతి ఎక్స్ట్రాగా తప్ప పనికిరాదని రుజువు చెయ్యటానికి మేనేజరు సరిగా ముప్పై అయిదు సెకండ్లు తీసుకున్నాడు. ప్రొప్రయిటరు విచారగ్రస్తుడైనాడు.

"ఇది చాలా విచిత్రంగా ఉంది. ఆ పిల్ల నాతో మాటాడుతుంటేనే నేనామె మొహంమీదినించి కళ్లు మరల్చలేను. ఆమె మాట్లాడినంత ఘాటుగా ఏ స్టార్ కూడా తెరమీద మాట్లాడగా చూడలేదు. టెస్టుచేస్తే ఆమె ఎక్స్ట్రాగాకూడా పనికి రాదు!" అన్నాడు ప్రొప్రయిటరు.

"ఎక్స్ట్రాగా పనికిరాకేంలెండి!" అన్నాడు మేనేజరు నిష్పక్షపాతంగా. ఆమెమీద అతగాడి కింకా ఏమాత్రమో ఆశ పట్టుకుని పీడిస్తున్నది. ఆమెను అవమానం చెయ్యాలనికూడా అతనికి లేకపోలేదు.

"అది ఆ పిల్ల ఖర్మ!" అన్నాడు ప్రొప్రయిటరు. అతనికి అర్థంకానిదంతా ఖర్మే, ప్రొప్రయిటరు ప్రాణానికి.

మర్నాడు మాలతి తనదగ్గిరికి వచ్చినప్పుడు ప్రొప్రయిటరు ఆమెను మొదటిసారి చాలా ఆదరంతో చూశాడు. మెప్పించదలచిన వాళ్ళకన్న నొప్పించదలచినవాణ్ణి ఎక్కువ ఆదరంతో చూడటం ప్రొప్రయిటరు విజయానికి కారణమేమో! ఆమెతో అతను కాస్సేపు స్నేహపూర్వకంగా సంభాషించి ఆఖరుకు చావుకబురు చల్లగా బయటపెట్టాడు.

అది విని ఒక నిమిషంపాటు మాలతి మాటాడలేదు.

"నీ కెంత కష్టంగా ఉంటుందో నే నూహించగలను. నీచేత ఎక్స్ట్రావేషం వేయించుకోవటం నాకు కష్టంగానేవుంది. నువు నా స్టూడియోలో వేషం వేసే ప్రయత్నం విరమించుకుంటే నేను చాలా సంతోషిస్తాను!" అన్నాడు ప్రొప్రయిటరు.


మాలతి కళ్ళలో కృతజ్ఞత కనిపించింది. ఆమె సంతోషరహితమైన చిరునవ్వొకటి నవ్వి, "ఫరవాలేదు. నేను ఎక్స్ట్రావేషానికి తగివుంటే ఆ వేషమే వేస్తాను!" అన్నది.

ప్రొప్రయిటరు కుర్చీలోనుంచి లేచి అటూ ఇటూ కాస్సేపు పచారుచేసి, ఆఖరికి మాలతి కెదురుగా నిలబడి, "ఒక లక్షపోతే పోయింది, నీకు ప్రధానపాత్ర ఇచ్చి ఒక పిక్చరు తీయిస్తాను. ఇంకా చవుకలోనే తీయిస్తాను" అన్నాడు.

"థాంక్స్! అటువంటి దేమీ చెయ్యకండి. నేను ఎప్పటికైనా నటించగలనని నాకు నమ్మకం ఉంది. నాకు కావలసిందల్లా అనుభవమే. ఒక్కసారిగా పెద్దవేషం వేసి చెడగొట్టితే ఆ అవకాశం కాస్తా పోగొట్టుకున్న దాన్నవుతాను. నన్ను అభిమానంకొద్దీ తొందిమతో సహాయించకండి!" అన్నది మాలతి.








నెలకు నూరురూపాయల వేతనంమీద మాలతి చిల్లరవేషాలు వెయ్యటానికి స్టూడియోలో బుక్కయింది. రెండునెలలు గడిచినై. ఈ కాలంలో ప్రొప్రయిటరు స్టూడియోకు రెండుసార్లు వచ్చాడు. కాని అతను మాలతికేసి చూడలేదు, ఆమెను పలకరించలేదు.

ఒకనాడు ప్రొప్రయిటరుగారు ఫోనుమీద పిలుస్తున్నారని మాలతికి కబురు వచ్చింది. మాలతి అదుర్దాతో వెళ్ళి టెలిఫోనులో మాట్లాడటం మొదలుపెట్టింది.

"హలో! ప్రొప్రయిటరుగారా? సాహెబ్జీ!...జీ?"

"నువు మాట్లాడే చోటింకెవరన్నా వున్నారా?" అన్నాడు ప్రొప్రయిటరు.

మాలతి చుట్టూ చూసి, "పాతికమంది ఉన్నారు!" అన్నది.

"ఫరవాలేదు. విను. నిన్ను మరో స్టూడియోవాళ్లు 250 కి బుక్‌చేసి మంచి వేషాలిస్తామంటున్నారు. నా మాటవిని వెళ్ళు మాలతీ!"

"థాంక్స్! నేను పోను."

"ఏం?"

"మన స్టూడియోలో, చక్కగా పబ్లిసిటీ ఇవ్వటమే చేతకాదు. ఇతర స్టూడియోలవాళ్ళు మనిషికి మించిన పబ్లిసిటీ ఇచ్చి పైకితెచ్చి క్రింద పడేస్తారు. ఇక్కడ హాయిగా ఆటువంటిదేమీలేదు. ఈ స్టూడియోలో మనిషి పైకివచ్చిందంటే అదంతా సొంత ప్రజ్ఞేనన్నమాట.

అదీకాక ఈ స్టూడియోలో శరీరాలు లంచంపెట్టే ఆడవాళ్ళకు పెద్దవేషాలు దొరుకుతై. వాళ్ళ పక్కన నడుకున్నవాళ్లు చిన్నవేషాలు వేసికూడా ప్రపంచం దృష్టి ఆకర్షించే అవకాశాలున్నై. అందుచేత నేనీ స్టూడియో వదలిపెట్టను థాంక్స్."

ఆమె రిసీవరు పెట్టేసి వెనక్కు తిరిగేటప్పటికల్లా స్టూడియో మేనేజరు ప్రత్యక్షమైనాడు.

"స్టూడియో వదలిపెట్టవేం? రేపటి నించీ నువ్వీ స్టూడియోకు రానవసరం లేదు. ఒకవేళ నిన్ను రాకుండా చెయ్యలేకపోతే నేను రాను. తెలిసిందా! కాషియర్, ఈవిడ జీతం లెక్కకట్టి ఇచ్చెయ్యి" అన్నాడు మేనేజరు

"అది మీరు లంచంకింద ఉంచుకోరాదూ? నా జీతం ఒక వారానికి పాతిక రూపాయలు. నా శరీరాన్ని బతికున్న రోజుల్లో ఆ ధరకే అమ్మాను" అన్నది మాలతి కటువుగా.

అక్కడవున్న పాతికమందీ కొయ్యబారిపోయినారు. మేనేజరుగారి నోట మాటరాలేదు. మాలతి మారుమాట లేకుండా నడిచిపోయింది.

ఆ రోజు సాయంకాలం మాలతి తన పదిహేను రూపాయల అద్దెగల గుహలో కూర్చునిఉండగా ప్రొప్రయిటరు కారు వచ్చి కింద ఆగింది. మరో అయిదు నిమిషాలకు యాభై మెట్లూ ఎక్కి ప్రొప్రయిటరుగారు పైకివచ్చారు.

"మాలతీ!" అని పిలుపు వినగానే మాలతి ఉలిక్కిపడ్డది. ఆమె ప్రొప్రయిటరును చూడగానే తొట్రుపడింది. అతను ఆ గుహ యావత్తూ కలియచూసి ఆమె పరచిన చాపమీద కూర్చున్నాడు. మాలతికూడా కూర్చుంది. చాలా సేపు ఇద్దరూ మాట్లాడలేదు.

"ఇదుగో నీ జీతం, 25 రూపాయలు!" అని ప్రొప్రయిటరు అయిదు కాగితాలు ఆమె చేతిలో పెట్టాడు. "నిన్ను మేనేజరు తొలిగించాడని విన్నాను. జరిగిందంతా విన్నాను. నేను చెప్పిన చోటికి ఇప్పుడైనా పోతావా?"

"ఏం? అట్లా అడుగుతున్నారు?"

"నువు వెళ్ళేటట్టయితే ఆ స్టూడియోలో కొంత డబ్బు పెట్టాలని చూస్తున్నాను."

"నా కర్థం కాలేదు"

"లేదా, నువు వేషంవేసిన పిక్చరయినా కొంటాను. అర్థమయేటందుకేముంది? సెంటిమెంటు నీతో నాకేదో సంబంధం ఉండాలనిపించింది. అటువంటి సెంటిమెంట్సు నాకుచాలా ఉన్నై."

"మీవంటి మనిషిని నేనెక్కడా చూడలేదు."

"ఆ స్టూడియోలోకాక ఏ స్టూడియోలో చేరినా నాకుమాత్రం వెంటనే తెలియజెయ్యి!"

"ఎక్కడో చేరకపోతే గడిచేదెట్లా?"

"శరీరం అమ్ముకుంటానన్నావు?"

"అదీ అయిపోయింది. ఒక తేళ్యం నన్ను ప్రేమించి, నన్ను కొనుక్కోలేక ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రే—మ!"

కాస్సేపు మాలతివంక చూసి ప్రొప్రయిటరు, "ఒకటి చెప్పు! నా స్టూడియోలో తొమ్మిది వారాలున్నావు; ఆ స్టూడియోను ఇంకా బాగుచెయ్యటానికి నీ సలహా డబ్బిచ్చి కొంటాను!" అన్నాడు.

"స్టూడియోలో ఏం జరుగుతున్నదీ తెలుసుకుంటూ ఉండండి. మీ కింద పని చేసేవాళ్ళ ప్రైవేటు విషయాలతో మీకు సంబంధం లేదనుకోకండి. చాలా సంబంధం ఉంది. మీ స్టూడియోవల్ల మీకిప్పుడు లాభం వస్తూండవచ్చును. అయినా ఇంకా లాభంవచ్చే అవకాశాలు లేకపోలేదు."

"అదే నేనూ అంటున్నది. మేనేజరును మార్చమంటావా?"

"వద్దు. అతను చురుకైన మేనేజరే. కాని అతని వ్యవహారం ఇతర విషయాల్లో బాగుండలేదు."

"నాకు స్టూడియోలో జరిగేదంతా ఎప్పటికప్పుడు తెలుస్తూనే ఉంటుంది. కాని అది సరిగా అర్థంచేసుకునే తెలివితేటలు నాకు లేవు."

"అయితే తెలిసినవారిని ఇంకొర్ని పెట్టండి."

"నువ్వుంటావా? నీకు జీతం ఇస్తాను."

"నేనా? నేనేం చెయ్యాలి?"

"నే నెప్పుడేం చెయ్యాలో చెప్పాలి."

"నాకా తాహతు లేదు."

"నన్ను పెళ్ళాడితే నీకా తాహతు వస్తుంది!" అన్నాడు ప్రొప్రయిటరు. "నీ కభ్యంతరం లేనట్టయితే!"

అంత మాటకారి అయిన మాలతి మాట తడబడ్డది. "నాకు—నాకు—".

ప్రొప్రయిటరు అర్థంచేసుకున్నాడు.

* *

మాలతి వివాహం స్టూడియోలో జరిగింది. స్టూడియోలో పనిచేసిన వారంతా అక్కడే ఉన్నారు. అనేక మంది గొప్పగొప్ప వ్యాపారస్తులుకూడా వచ్చారు.

స్టూడియో మేనేజరుతో మాలతి, "ఏమండీ, నాకు మీ స్టూడియోలో చిన్న ఉద్యోగం ఇప్పిస్తారా?" అన్నది నవ్వుతూ

"కావాలంటే ఎక్స్ట్రావేషం ఇప్పిస్తాను" అన్నాడు మేనేజరు, తనూ నవ్వుతూ.

"నా కవసరంలేదు. నా కేదయినా పెద్దవేషం ఇస్తేనే వేస్తాను," అన్నది మాలతి.

"అట్లా అయితే మీరింకో స్టూడియో ప్రొప్రయిటర్ని పెళ్ళాడవలసింది!" అన్నాడు మేనేజరు.

"నేను చెప్పలేదా, మన మేనేజరు చురుకైనవాడని?" అన్నది మాలతి మొగుడితో.

---